క్లుప్తంగా

ఉపాధి సిబ్బంది సక్రమంగా పని చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: ఉపాధిహామీ పథకం సిబ్బంది గత ఐదు సంవత్సరాలు విధులు నిర్వహించినట్లే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పని చేయాలని, వేతనదారులకు సక్రమంగా పనికల్పించాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద అన్నారు. ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదికను మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. 17వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా పలు పంచాయతీల్లో మస్టర్లలో తేడా ఉన్నాయని, ఆబ్సెంట్లు వేసి మరలా ప్రజెంట్‌లు వేసి ఉన్నారని డీఆర్‌పీలు తెలియజేశారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు వారు పనికి ఆలస్యంగా రావడం వలన ఆబ్సెంట్లు వేసి మరలా ప్రెజెంట్ వేయడం జరిగిందన్నారు. ఏపీడీ రాధ, డీవీవో స్వరూప రాణి, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ రమేష్, సర్పంచ్‌లు తడక జోగారావు, గున్నయ్య పాల్గొన్నారు.

14న లోక్ అదాలత్

సోంపేట: సోంపేట కోర్టు సముదాయంలో డిసెంబర్ 14వ తేదీన నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాము పోలీసు అధికారులకు సూచించారు. సోంపేట పోలీసు సర్కిల్ అధికారులతో శుక్రవారం కోర్టు సముదాయంలో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌తో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు ప్రయత్నించాలన్నారు. రాజీతో ఇరువర్గాలకు ప్రయోజనం చేకూరుతుందనే విషయాన్ని కక్షిదారుల్లో అవగాహన కల్పించాలన్నారు. సీఐ బి.మంగరాజు, సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు మంజూరు



మాట్లాడుతున్న ఎల్‌డీఎం సూర్యకిరణ్

ఇచ్ఛాపురం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ బ్యాంకులు వ్యక్తిగత రుణాలు అందజేసి వారి పురోభివృద్ధికి దోహదపడాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్ అన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఇచ్ఛాపురం, కవిటి మండలల్లోని బ్యాంకు అధికారులతో శుక్రవారం నిర్వహించిన 'జాయింట్ మండల్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ' సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్ బ్యాంకు ద్వారా రూరల్ స్వయం ఉపాధి శిక్షణ కార్యాలయం ఎచ్చెర్లలో ఉన్న నేపథ్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ ట్రేడుల్లో వారం రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ లిలంత్ మిశ్రా, మండల వ్యవసాయాధికారి టి.భార్గవి, సెర్ప్ ఏపీఎం ఎస్.ప్రసాదరావు, మెప్మా సిబ్బంది, రెండు బ్యాంకుల సిబ్బంది హాజరయ్యారు.

భూ సమస్యలపై కలెక్టర్ సమీక్ష



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

కాశీబుగ్గ: పలాస రెవెన్యూ డివిజన్ కేంద్రం పరిధిలో పనిచేస్తున్న అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం సమీక్షించారు. పాతజాతీయ రహదారి సమీపంలోని టీకేఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో భూ సమస్యలపై సమీక్షించారు. పలాస ఆర్డీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి రెవెన్యూ సమస్యలు

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండల పరిధిలో నెలకున్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు కోరారు. జంట పట్టణాల్లో ఆక్రమణలు తొలగించాలని, ప్రభుత్వ స్థలాలు కాపాడాలని కోరారు.

విద్యార్థులకు సామాజిక దృక్పథం అవసరం



సైకిల్ పార్కింగ్ స్టాండ్‌ను ప్రారంభిస్తున్న ప్రకాశరావు

టెక్కలి: విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక దృక్పథం అవసరమని బలగ ఫౌండేషన్ చైర్మన్ బలగ ప్రకాశరావు కోరారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బలగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన సైకిల్ పార్కింగ్ స్టాండ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులంతా లక్ష్య సాధనతో విద్యనభ్యసించాలని కోరారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించినా సొంత ఊరు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను మరచిపోవద్దన్నారు. కళాశాల యాజమాన్యం ప్రకాశరావును సన్మానించారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ పాల్గొన్నారు.

ఆదాయం ఘనం.. ప్రసాదం కనం!

- మల్లన్న సన్నిధిలో కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లపై విమర్శలు
- తరచూ బయటపడుతున్న డొల్లతనం
- నామమాత్రంగా మంత్రి అచ్చెన్న ఉచిత ప్రసాదం పంపిణీ ప్రకటన



ఈనెల 18వ తేదీ ఉదయం 10.30 గంటలకే ఖాళీ అయిపోయిన ఉచిత ప్రసాదం కౌంటర్

టెక్కలి: మల్లన్న దర్శనానికి విశాఖపట్టణం నుంచి వచ్చాం.. దర్శనం చేసుకుని ప్రసాదం తీసుకువెళ్లలనుకున్నాం.. ఇక్కడ కనీసం ప్రసాదం పెట్టకపోవడం బాధాకరంగా ఉంది.. ఉదయం భక్తులు రద్దీగా ఉన్నప్పుడే ప్రసాదం అయిపోయిందని చెప్పడం ఎంతో బాధగా ఉందంటూ ఈ నెల 18వ తేదీ సోమవారం రావివలస మల్లన్న దర్శనానికి వచ్చిన ఓ భక్తుడి ఆవేదన వ్యక్తం చేశాడు. మల్లన్న దర్శనం కోసం అమ్మకాలు చేస్తున్న టికెట్‌ల విషయంలో పాతవాటినే మళ్లీ అమ్మకాలు చేస్తున్నారు. ఇదెక్కడి మోసం అంటూ గత సోమవారం భక్తులు అధికారులను నిలదీశారు. కలియుగ కైలాసంగా పేరుగాంచిన టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ప్రస్తుతం జరుగుతున్న కార్తీకమాసం ఉత్సవాల్లో భక్తుల నుంచి అసహనం చోటు చేసుకుంటోంది. గడచిన మూడు వారాల పాటు జరిగిన ఉత్సవాల్లో దేవదాయశాఖ అధికారుల తీరుపై భక్తులు మండిపడుతున్నారు. తరచూ జరిగిన తప్పిదాలు భక్తుల అసహనానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. ఏటా ఎంతో ఘననీయమైన ఆదాయం కలిగిన రావివలస మల్లన్న ఉత్సవాల విషయంలో ఈ ఏడాది భక్తుల నుంచి విమర్శలు చోటు చేసుకోవడం అధికారుల వైఫల్యంగా కనిపిస్తోంది.

ఉచిత ప్రసాదాల నుంచి టికెట్ అమ్మకాల వరకు..

రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఈ నెల నాలుగో తేదీ నుంచి కార్తీకమాసం ఉత్సవాలను దేవదాయశాఖ అధికారులు ప్రారంభించారు. ఇప్పటికే మూడు వారాలు గడచాయి. అయితే మూడు వారాల పాటు అనేక తప్పిదాలు చోటు చేసుకుని భక్తుల నుంచి విమర్శలు చోటు చేసుకున్నాయి. మల్లన్న దర్శనానికి ఉచిత క్యూ మార్గంతో పాటు టికెట్ ద్వారా వెళ్లే క్యూ మార్గాలను ఏర్పాటు చేశారు. అయితే టికెట్ అమ్మకాల కోసం ఉచిత క్యూ మార్గంలో ఉన్న భక్తులను పడిగాపులు కాయించారనే విమర్శలు చోటు చేసుకున్నాయి. వీటితో పాటు ఈ ఏడాది ఎటువంటి ప్రసాదాలు అమ్మకాలు చేయవద్దని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు.

భక్తులకు ఉచితంగా ప్రసాదాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. దీంతో రెండు సోమవా రం వారాలు దాతల సాయంతో ఉచిత ప్రసాదాలు అందజేశారు. అది కూడా ఒకే కౌంటర్ ఏర్పాటు చేయడంతో భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తా యి. మూడవ సోమవారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ప్రసాదం కౌంటర్‌లో ఉదయం 10.30 గంటలకే ప్రసాదాల పంపిణీ నిలిపివేశారు. అంతే కాకుండా భక్తులు ఒకసారి కొనుగోలు చేసిన టికెట్లను మరళా అమ్మకాలు చేయడం మరింత విమర్శలకు దారి తీసింది. దీనిపై పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆర్జీవో ఎం.కృష్ణమూర్తి దేవదాయశాఖ ఈవో గురునాథరావును మందలించడం గమనార్హం. ఎంతో ప్రతిష్టాత్మకమైన చరిత్ర కలిగిన ఎండల మల్లన్న సన్నిధిలో ఉత్సవాల నిర్వాహణ విషయంలో దేవదాయ శాఖాధికారుల నిర్లక్ష్యంపై భక్తులు నుంచి తారస్థాయిలో విమర్శలు చోటు చేసుకున్నాయి. కనీసం ఈ నెల 25వ తేదీ నాలుగో కార్తీక సోమవారం రోజునైనా ఉచిత ప్రసాదాలు ఆలయానికి వచ్చే భక్తులందరికీ అందించే విధంగా దేవదాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

29న చలో శ్రీకాకుళం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దళిత సంఘ నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: అన్నదమ్ముల్లా కలసి మెలసి ఉంటున్న మాల, మాదిగల మధ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ పేరుతో చిచ్చుపెడుతున్నాయని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట అధ్యక్షుడు సల్ల దేవరాజు అన్నారు. శుక్రవారం ఆయన దళిత సోదరులతో కలసి చలో శ్రీకాకుళం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం వర్గీకరణ పేరుతో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు వర్గీకరణ పూర్తయ్యేవరకు ఉద్యోగ నియమాకాల నోటిఫికేషన్లు నిలుపుదల చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లాలో మాలలందరితో కలసి వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 29న శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో చేపట్టబోయే 'చలో శ్రీకాకుళం' నిరసన కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటం నియోజకవర్గ గౌరవ సలహాదారుడు నూతన పాటి బాబూరావు, కవిటి మండల ఉపాధ్యక్షుడు మద్దిలి కేశవరావు, సంఘ ప్రతినిధులు నందూరు చలపతి, బోకురు కాళీ, చుక్క మధు పాల్గొన్నారు.

కవిటి: ఎస్సీ కులాల వర్గీకరణ పేరుతో కులాల మధ్య చిచ్చురేపుతున్న ప్రభుత్వతీరుకు నిరసనగా ఈ నెల 29న శ్రీకాకుళంలో నిర్వహిస్తున్న మాలల మహాగర్జన ర్యాలీకి తరలి రావాలని సంఘం ప్రతినిధులు కోరారు. డిగొనపపుట్టుగ దళితసంఘం కార్యాలయం వద్ద ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



వజ్రపుకొత్తూరు రూరల్: వాలీబాల్ పోటీలో తలపడుతున్న విద్యార్థులు



ఇచ్ఛాపురం: వాలీబాల్ విజేతలతో రోటరీక్లబ్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: రోటరీక్లబ్ న్యూజనరేషన్ మంత్ సందర్భంగా మండలస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. వాలీబాల్ పోటీల్లో మున్సిపల్ ఉన్నత పాఠశాల పురుషోత్తపురం విన్నర్స్‌గా, జెడ్పీహెచ్‌ఎస్ ఈదుపురం రన్నర్స్‌గా, కబడ్డీలో జెడ్పీహెచ్‌ఎస్ డొంకూరు విన్నర్స్‌గా, జెడ్పీహెచ్‌ఎస్ ఈదుపురం రన్నర్‌గా నిలిచాయి. రోటరీ అధ్యక్షులు పైడిశెట్టి దినేష్, రోటరీక్లబ్ ప్రతినిధులు రాజ్‌కుమార్, వి.సురేష్‌కుమార్, నవీన్‌కుమార్, కృష్ణమూర్తి, మధు, గోపీచౌదరి, రామారావు ఉన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గ్రిగ్స్‌మీట్ మండల స్థాయి క్రీడా పోటీలు రసవత్తంగా సాగుతున్నాయి. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా తలపడుతున్నారు. అండర్ 17, 14 విభాగాల్లో ఖోఖో క్రీడలో నగరంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల జట్టు ప్రథమ స్థానంలో నిలవగా పాతటెక్కలి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్ 17 విభాగంలో వాలీబాల్ ఆటలో పాతటెక్కలి స్కూల్ జట్టు ప్రథమ, గోవిందపురం జట్టు ద్వితీ య స్థానంలో గెలిపొందాయి. అండర్–14 విభాగంలో గోవిందపురం ప్రథమ, అక్కుపల్లి గురుకుల పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలికల అండర్ 17 విభాగం కబడ్డీలో దేవునల్తాడ ప్రథమ, డోకులపాడు ద్వితీ య స్థానంలో నిలిచాయి. అండర్ 14 విభాగంలో హుకుంపేట ప్రథమ, దేవునల్తాడ క్రీడాకారులు ద్వితీయ స్థానంలో గెలిపొంది జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. పోటీలను ఎంఈవో దశరథ పర్యవేక్షించారు. పీడీలు చంద్రశేఖర్, పి.గజేంద్ర ఉన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: పదిరోజులు నిర్వహించిన అసెంబ్లీ సమావేశాలతో ప్రజాధనం దుర్వినియోగం అయింది తప్పితే ఏమాత్రం ప్రయోజనం లేదని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. అసెంబ్లీ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా.. ప్రతిపక్షం లేకుండా ఏకపక్ష నిర్ణయాలతో కూటమి ప్రభుత్వం అసెంబ్లీని కొనసాగించారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలతో అవసరం లేకుండా కేవలం మంత్రుల స్వార్థానికి పది రోజులతో పాటు ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ సమావేశాలను కొనసాగించారని దుయ్యబట్టారు. శాసన మండలి చైర్మన్‌ను కనీసం గౌరవించకుండా కూటమి మంత్రులు ప్రవర్తించిన తీరు దారుణమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బెదిరింపుల ధోరణికి పాల్పడే విధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కేవలం సీఎం చంద్రబాబును పొగడ్తలతో గడిపేయడానికి ఈ సమావేశాలను వేదికగా చేసుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఒక వైపు సోషల్ మీడియా కార్యకర్తలను, సాధారణ వర్గాలను అణచి వేయడానికి పోలీసులను ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నారన్నారు. పోలీసులు కేసులు పెట్టాలనుకుంటే ముందుగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, అనితపై నమోదు చేయాలన్నారు. గతంలో ప్రతిపక్ష హోదాలో ఉన్నపుడు నోటికి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడిన ఘనత వీరిదేనని.. దీనికి సామాజిక మాధ్యమాల్లో ఉన్న వీడియోలు నిదర్శనమని తిలక్ పేర్కొన్నారు. పది రోజుల పాటు స్వార్థ ప్రయోజనాల కోసం అసెంబ్లీ సమావేశాలు కొనసాగించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు.

రైతులు ఈకేవైసీ చేసుకోవాలి

టెక్కలి: టెక్కలి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని రైతులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని సీఈవో పి.శ్రీమన్నారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ ఐదో తేదీలోగా రైతులంతా పట్టాదారు పాసు పుస్తకం, 1–బీ, ఆధార్, రేషన్‌కార్డు, పాన్ కార్డు, డీసీసీబీ బ్యాంకు ఖాతా, నామినీ ఆధార్ తదితర జిరాక్స్ పత్రాలతో తమ కార్యాలయంలో ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు.

వ్యవసాయశాఖ ఏఈవోగా శ్రీకల్యాణ్



శ్రీకల్యాణ్

కవిటి: కవిటి–2 గ్రామసచివాలయంలో వ్యవసాయశాఖ సహాయకునిగా పనిచేస్తున్న బెందాళం శ్రీకల్యాణ్‌కు ఆదేశాఖలో వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో)గా పదోన్నతి కల్పిస్తూ జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉత్తర్వులు జారీచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవసాయశాఖ సహాయకునిగా పనిచేసిన శ్రీకల్యాణ్ అనతికాలంలోనే ఏఈవోగా పదోన్నతి పొందడంపై సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొల్లాయి అశోక్ సంతోషం వ్యక్తం చేశారు.

రిజర్వేషన్ కౌంటర్‌ను రెండో పూటా కొనసాగించాలి




అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

కంచిలి: సోంపేట రైల్వే స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌ను రెండో పూట కూడా కొనసాగించాలని రైల్వే స్టేషన్ కన్సల్టింగ్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు రెగ్యులర్ ఇన్‌స్పెక్షన్ కోసం సోంపేట రైల్వే స్టేషన్‌కు శుక్రవారం వచ్చిన సీఎంఐ అజయ్‌కుమార్‌ను రైల్వేస్టేషన్ కన్సల్టింగ్ కమిటీ సభ్యులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఇటీవల సోంపేట స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్‌లో రెండో షిఫ్టులో సేవల్ని రద్దు చేశారు. దీంతో రెండో పూట రిజర్వేషన్ చేయడానికి వచ్చే ప్రయాణికులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఈ స్టేషన్ మీద కంచిలి, కవిటి, సోంపేట మండలాలతోపాటు సమీప ఒడిశా సరిహద్దు గ్రామాలకు చెందిన ప్రయాణికులు ప్రయాణ అవసరాల కోసం ఆధారపడుతున్నారని, ఆదాయ పరంగా కూడా సమీప స్టేషన్ల కంటే అధికంగా వస్తుందని సీఎంఐకి వివరించారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని రద్దుచేసిన రెండో షిఫ్టు రిజర్వేషన్ కౌంటర్ సేవల్ని పునఃప్రారంభించాలని కోరారు. సీఎంఐని కలిసిన వారిలో రైల్వేస్టేషన్ కన్సల్టింగ్ సభ్యులు పూనా రవికుమార్, షావుకారు తిరుపతిరావు, నాగేంద్రపట్నాయక్ ఉన్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

టెక్కలి: ఈ నెల 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా టెక్కలి నియోజకవర్గంలో చేపట్టనున్న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేఖ పోరాట కమిటీ నాయకులు బోకర నారాయణరావు, చల్లా రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. జె.చంద్రశేఖర్‌రావు, కె.కామేశ్వరరావు, జె.బాబూరావు, ఎస్.గోపి, పి.ఆదప్‌రావు, కె.సింహాచలం ఉన్నారు.

మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ప్రస్తుతం జరుగుతున్న వివిధ మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సీఐ మీసాల చిన్నంనాయుడు అన్నారు. పురపాలకం సంఘం పరిధి బెల్లుపడ గ్రామంలో శుక్రవారం సాయంత్రం ప్రజలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు చాలామంది బానిసలు కావడం వల్ల కలిగే అనర్థాలు, వాహనాలు నడిపేటప్పుడు పాటించవలసిన ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నాయకుల పరామర్శ



కవిటి: రవి కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు



వీరాస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కంచిలి: బూరగాం గ్రామానికి చెందిన ప్రభుత్వ కళాశాల రిటైర్డు లెక్చరర్ మద్దు వీరాస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి వీరాస్వామి కుటుంబసభ్యులను శుక్రవారం పరామర్శించారు. మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దు వెంకటరావు, మద్దు వెంకటేశ్వరరావు, మద్దిల భీమారావు, సర్పంచ్ గణప సింహాచలం ఉన్నారు.

కవిటి: జగతి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత బావన రవికుమార్ మాతృమూర్తి బాలాకుమారి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, సర్పంచ్ పూడి వరప్రసాద్ శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆధార్ అప్‌డేట్‌కు కష్టాలు

టెక్కలి: అపార్ నమోదు కోసం ఆధార్ అప్‌డేట్‌కు విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. రోజూ ఆధార్, పంచాయతీ, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. డివిజన్ కేంద్రమైన టెక్కలిలో శుక్రవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలోని ఆధార్ సెంటర్ వద్ద కేంద్రం తెరవక మునుపే విద్యార్థులంతా చేరుకుని పడిగాపులు కాయడం కనిపించింది.

ఎస్సైకి అభినందనలు

కవిటి: కవిటి ఎస్సైగా విధుల్లో చేరిన రవివర్మను శుక్రవారం పలువురు కలిసి అభినందించారు. కవిటి మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్‌తో పాటు కవిటికి చెందిన పలువురు యువకులు ఎస్సైని కలిసిన వారిలో ఉన్నారు. ప్రశాంతమైన పోలీసింగ్‌కు సహకరించాలని ఎస్సై కోరారు.

నేత్రవైద్య శిబిరం..



బోరుభద్ర పీహెచ్‌సీ ఆవరణలో ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ పి.అవని మాట్లాడుతూ.. 40 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా కాటరాక్ట్, డయాబెటిక్ రెటినోపతి, గ్లోకోమా వంటి కంటి సంబంధిత వ్యాధులు ఉన్నట్‌లైతే ముందుగా తెలుసుకొని కంటిచూపు కోల్పోకుండా చూసుకోవచ్చునన్నారు. ఆప్తలమిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్ 60 మందికి పరీక్షలు నిర్వహించారు. 12 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. సీహెచ్‌వో డి.పద్మావతి, ఆరోగ్య పర్యవేక్షకులు డి.కమలమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. –సంతబొమ్మాళి

యూటీఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ

మందస మండలం హరిపురం గ్రామంలో ఈ నెల 24, 25 తేదీల్లో జరగనున్న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని కంచిలి మండల యూటీఎఫ్ శాఖ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జిల్లా మహాసభల పోస్టర్లను శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రం వద్ద ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబుల చేతులమీదుగా విడుదల చేశారు. మండలశాఖ ప్రధాన కార్యదర్శి నల్లా న రవి, కోశాధికారి త్రినాథ్, గౌరవ అధ్యక్షుడు త్రిలోచన ప్రధాన్, జిల్లా కౌన్సిలర్లు పురుషోత్తంరెడ్డి, హేమసుంద ర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ జె.భగవతిరావు, త్రినాథ్ సాహు, క్రిష్ణచంద్ర బెహరా పాల్గొన్నారు. –కంచిలి



మొక్కలు నాటివేత



హరితాంధ్రప్రదేశ్‌కు విద్యార్థులు చేయూతనివ్వాలని కంచిలి మండలం బూరగాం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రోజారాణి అన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ప్రతి విద్యార్థి తన పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు బాధ్యతగా మెలగాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరరావు, ధర్మారావు, జగన్, కాంతారావు, నిరంజన్ ఖడంగా, శివరాం బెహరా, మోహన్, హరికృష్ణ పాల్గొన్నారు. –కంచిలి